క్లుప్తంగా

ప్రత్యేకాలంకరణలో సత్తెమ్మ తల్లి


సత్తెమ్మ తల్లి

బిక్కవోలు: గ్రామంలోని జవ్వలదొడ్డిలో కొలువైన సత్తెమ్మ తల్లి గురువారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలోని అమావాస్య కావడంతో అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ


వాటర్ కూలర్ అందించిన దాత సుధా మాధురి

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి ఉన్నత పాఠశాలకు వాటర్ కూలర్ అందజేశారని హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈ పాఠశాల పనిచేసి బదిలీపై వెళ్లిన పి.సుధా మాధురి అనే ఉపాధ్యాయురాలు రూ.10 వేల విలువైన ఈ కూలర్ అందించారన్నారు. విద్యార్థులకు ఈ కూలర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ


వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న వైద్యులు

రాజానగరం: గ్రాసిమ్ ఇండస్ట్రీస్ సహకారంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 16 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు గురువారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ రామభాస్కర్, డాక్టర్ లక్ష్మి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బందితో పాటు, దాతలు సుందర్, కేజియా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుచరిత్ర పారాయణ

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురుచరిత్ర పారాయణ యజ్ఞం మూడో గురువారానికి చేరింది. స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో 11 గురువారాలు జరిగే ఈ పారాయణ యజ్ఞంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేకువజామున కాకడ హారతి అనంతరం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన పారాయణ మధ్యాహ్నం 2.30 వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బాబావారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో మందిరం కళకళలాడింది. మధ్యాహ్న హారతి అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ప్రాజెక్టు వర్కర్లు

సీతానగరం: మండలంలోని సత్యసాయి డ్రికింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికుల ఆందోళన గురువారం 17 రోజులకు చేరింది. రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద ఆందోళనకారులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు.

గోతిలో కూరుకుపోయిన లారీ


గోతిలో దిగబడిపోయిన లోడు లారీ

సీతానగరం: రాపాక–కోటికేశవరం రోడ్డులో ఏర్పడిన గోతులతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కోటికేశవరం వైపు నుంచి గురువారం లోడుతో వస్తున్న లారీ గోతిలో పడి కూరుకుపోయింది. దానిని బయటకు తీసే మార్గం లేకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయాడు. రాపాక నుంచి నాలుగు కి.మీ. రోడ్డు అధ్వానంగా ఉంది.

క్లాప్‌మిత్రాలకు సహకరించాలి

పెదపూడి: తడి, పొడి చెత్తపై ప్రజలు అవగాహన పెంచుకుని, చెత్త సేకరణ చేసే క్లాప్‌మిత్రాలకు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆయన గురువారం పెదపూడిలో క్లాప్ మిత్రాల చెత్త సేకరణ పనులను పరిశీలించారు. సచివాలయ కార్యదర్శులు జి.ఉషారాణి, సుధీర్‌రెడ్డి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మోగనున్న పెళ్లి బాజా..

- శ్రావణ మాసానికి స్వాగతం
- ఈ నెల 26 నుంచి వరుస ముహూర్తాలు
- పురోహితులు, మంగళ వాయిద్యాలకు డిమాండ్
- ఊపందుకోనున్న అనుబంధ వ్యాపారాలు


వివాహానికి సిద్ధం చేసిన కల్యాణ వేదిక

బిక్కవోలు: శ్రావణ మాసం వచ్చేసింది. దీంతో శుభ కార్యక్రమాలకు తెర లేచింది. ఈ నెలను శుభప్రదంగా ప్రజలందరూ భావిస్తారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు తదితర అన్ని కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇప్పటికే గురు మూఢం కారణంగా దాదాపు 48 రోజులుగా శుభ కార్యాలు లేవు. ఈ నేపథ్యంలో అమ్మకాలు లేక మార్కెట్ వెలవెలబోయింది. ప్రస్తుతం శ్రావణం రావడంతో మళ్లీ ఉత్సాహం వచ్చింది. భూమి పూజలు, గృహ ప్రవేశాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, పెళ్లిళ్లకు ముహూర్తాలు పెట్టుకున్నారు.

పురోహితులకు డిమాండ్

శ్రావణ మాసంలో వివాహాలు, నూతన గృహ ప్రవేశాలు, దుకాణాల ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలకు శుభ ముహూర్తాలుండడంతో పురోహితులకు డిమాండ్ పెరిగింది. పెళ్లిళ్లను కొందరు తమ ఇంటి ముందే పందిరి వేసి, అందంగా ముస్తాబు చేసి నిర్వహిస్తారు. మరికొందరు ఫంక్షన్ హాళ్లలో నిర్వహించుకుంటారు. పెళ్లి జరిగితే భాజా భజంత్రీలు, ఫొటోగ్రాఫర్లు, ఫ్లవర్ డెకరేషన్లకు, కర్పూర దండల షాపులకు, లైటింగ్, మైక్ సెట్ దుకాణాల వద్ద హడావుడి పెరుగుతుంది. ఇక బంగారం, వస్త్ర దుకాణాలు జనాలతో కిటకిటలాడతాయి. పెళ్లిళ్లలో విందు భోజనాలు వండే వంట మాస్టర్లకు ఖాళీ ఉండదు.

మంచి ముహూర్తాలు ఇవే..

శ్రావణమాసం ప్రారంభమైన మరుసటి రోజు నుంచే మంచి ముహూర్తాలు మొదలవుతాయని పండితులు చెబుతున్నారు. జూలై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17వ తేదీ వరకూ ఇవి ఉన్నాయి. మళ్లీ సెప్టెంబర్ 23, 24, 26, 27, 28 తేదీల్లో జరుగుతాయి. అక్టోబర్ 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబర్ 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22 ,23, 25, 26, 27 తేదీల్లో వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలని పండితులు చెబుతున్నారు.

డ్రోన్ ఫొటోగ్రఫీకి ప్రాధాన్యం

ప్రస్తుతం డ్రోన్ ఫొటోగ్రఫీ, వీడియోలకు గిరాకీ పెరిగింది. ఆకాశం నుంచి అత్యంత క్వాలిటీతో ఫొటోలు, వీడియోలు తీయడం ఈ ఫొటోగ్రఫీ విశిష్టత. ఈ కొత్త విధానానికి ప్రజల ఆదరణ బాగుంది. డ్రోన్‌తో ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఒక్కో కార్యక్రమానికి సుమారు రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకూ తీసుకుంటారు. దీనికి ప్రింటింగ్ ఖర్చు అదనం.

మంగళ వాయిద్యాల జోరు

హిందూ సంప్రదాయంలో బాజాభజంత్రీలు లేనిదే పెళ్లిళ్లు జరగవు. అందుకే మంగళ వాయిద్యాలకు తొలి ప్రాధ్యానం ఉంటుంది. వధూవరులను సిద్ధం చేయడం నుంచి, పెళ్లయిన తర్వాత వారిని ఇంటికి తీసుకొచ్చేవరకూ వాయిద్యాల అవసరం ఉంటుంది. నియోజకవర్గంలో బ్యాండ్ మేళం గ్రూప్‌లు ఒక్కో కార్యక్రమానికి రూ.పదివేలకు పైగా తీసుకుంటున్నాయి. కొందరు పెళ్లిలో సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. దీనికి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ సంగీత కళాకారులు వసూలు చేస్తున్నారు.

విందుకు ప్రత్యేక స్థానం

విందు లేనిదే పెళ్లి ఉండదు. దీనికి చాలా మంది అధిక ప్రాధాన్యం ఇస్తారు. భోజనాలు రుచిగా, శుచిగా ఉండాలని బంధుమిత్రుల్లో మాట రాకూడదని భావిస్తారు. అందుకే ఎంత ఖర్చయినా వెనుకాడరు. ఉదయం టిఫిన్ దగ్గర నుంచి రాత్రి భోజనం వరకూ ఆహార పదార్థాలను సరఫరా చేసే క్యాటరింగ్ సంస్థలు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. ఇవి మెనూ ప్రకారం ధరను నిర్ణయిస్తాయి. ఎంచుకున్న పదార్థాల బట్టి ప్లేట్ ధర సుమారు రూ.120 నుంచి రూ.350 వరకూ ఉంటుంది.

పెరుగుతున్న పసిడి ధర

మార్కెట్‌లో బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. శుభముహూర్తాలు సమీపించడంతో బంగారంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. దీని ధర మరింత పెరిగే అవకాశం కూడా ఉంది.

శ్రావణం శుభప్రదం



ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి నుంచి దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమైంది. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో వివాహాలు, శుభకార్యాలకు అనుకూలంగా ఉంటుంది.

– గరిమెళ్ల విశ్వేశ్వరరావు (బుజ్జి), పండితుడు, పందలపాక

ప్రత్యేక వంటకాలు



పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు రకరకాల వంటకాలతో భోజన ప్రియులను మెప్పించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త వంటకాల రుచి చూపించాలి. అందుకు అనుగుణంగా సమాయత్తమవుతున్నాం. శాకాహారంలో ప్రత్యేక వంటకాలు తయారు చేస్తున్నాం.

– గొడ్డు సూర్యనారాయణ (ఆరికరేవుల సూరిబాబు), వంట మాస్టర్, ఆరికరేవుల

అవకాశాలు బాగున్నాయి



గతంలో ఏ చిన్న ఫొటో తీయాలన్నా ఫొటోగ్రాఫర్ అవసరం ఉండేది. ఇప్పుడు స్మార్ట్ ఫోన్లు రావడంతో ఫొటోగ్రాఫర్లకు పని తగ్గిపోయింది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా డ్రోన్, డిజిటల్, ఫొటోషూట్‌లతో అవకాశాలు బాగున్నాయి. పెళ్లిళ్ల సీజన్‌లో తీరిక లేకుండా అవకాశాలు వస్తున్నాయి.

– జి.భద్రరావు, వీడియో/ఫొటోగ్రాఫర్, పందలపాక

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు


దుర్గారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

అనపర్తి: వైఎస్సార్ సీపీ నాయకుల అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో ప్రతిపక్ష పార్టీలను, ప్రజలను భయపెట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి (ఆర్క్) అన్నారు. ఆయన గురువారం అనపర్తిలో విలేకరులతో మాట్లాడారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అక్రమ గృహ నిర్బంధం ఘటనలు కూటమి ప్రభుత్వ పైశాచికత్వానికి పరాకాష్ట అన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వంపై ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ నాయకులు పోరాటం చేస్తున్నారన్నారు. పాలకుల మోసాలను ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులను కట్టడి చేయడానికి లిక్కర్ కేసును సృష్టించి పథకం ప్రకారం అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కేసులకు, దాడులకు భయపడే తత్వం వైఎస్సార్ సీపీ శ్రేణులకు లేదని దుర్గారెడ్డి అన్నారు.

ఉమెన్ గేమ్స్‌లో చాంపియన్ జీఎస్ఎల్


ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో జీఎస్ఎల్ విద్యార్థులు

రాజానగరం: మూడు రోజులుగా స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ 25వ ఉమెన్ గేమ్స్ పోటీలు గురువారం ముగిశాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 24 మెడికల్, డెంటల్ కళాశాలల నుంచి 527 మంది క్రీడాకారులు పాల్గొన్నారని యూనివర్సిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏ హెల్త్ యూనివర్సిటీలో లేని విధంగా గేమ్స్, కల్చరల్ కార్యక్రమాల నిర్వహణలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. ఇంటర్ యూనివర్సిటీ నాన్ అకడమిక్ కార్యక్రమాలకు ఏటా రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలను బహూకరించారు. జీఎస్ఎల్ చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో వరిసాగు చేపట్టాలి


పశ్చిమ గానుగూడెంలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

కోరుకొండ: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా నరసింహారావు అన్నారు. మండలంలోని పశ్చిమగానుగూడెంలో గురువారం వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహారావు మాట్లాడుతూ రైతులు మెళకువతో వ్యవహరిస్తూ సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించగలరన్నారు. నారుమడిలో యాజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. విత్తనశుద్ధితో చాలా ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాటన్ మహనీయుని సేవలు చిరస్మరణీయం


రామవరంలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి, వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి జలాలను ఒడిసి పట్టి, డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడు కాటన్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. కాటన్ వర్ధంతిని గురువారం రామవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ విగ్రహానికి కృష్ణారెడ్డితో పాటు పీహెచ్‌సీ డీసీ మాజీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు క్షామంతో కొట్టుమిట్టాడుతున్న గోదావరి జిల్లాలను, ఆనకట్ట ద్వారా సస్యశ్యామలం చేసిన ఘనత కాటన్‌దేనన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ పాలక మండలి సభ్యులు కర్రి రామచంద్రారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి పద్మావతి, వైఎస్సార్ సీపీ నేతలు కర్రి గాంధీ రెడ్డి, మంత్రి అప్పారావు, కర్రి గోపాలరెడ్డి, నల్లమిల్లి అచ్చిరెడ్డి, టేకి రాఘవ, కొవ్వూరి ఆదిరెడ్డి, నల్లమిల్లి ఆదినారాయణరెడ్డి (బాబ్జి), చింతా ప్రభాకరరెడ్డి, పులగం శివారెడ్డి, తమలంపూడి దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి నియంత పాలన

- కక్ష సాధింపులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నియంత పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకే కూటమి ప్రభుత్వం.. పథకం ప్రకారం వైఎస్సార్ సీపీ నాయకులను కేసుల్లో ఇరికిస్తోందన్నారు. తద్వారా వారిని పార్టీకి దూరం చేయాలని భావిస్తోందన్నారు. రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెదిరెడ్డి మిథున్‌రెడ్డిపై పెట్టిన లిక్కర్ కేసు పూర్తిగా నిరాధారమైనదన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఆయనను అరెస్టు చేశారన్నారు. ఆ కేసులు న్యాయస్థానంలో నిలిచేవి కావన్నారు. చంద్రబాబు నాయుడు తన ఆధ్వర్యంలో పనిచేసే అధికారులతో ఏర్పాటు చేసిన సిట్‌తో ప్రజల దృష్టి మరల్చడానికి వైఎస్సార్ సీపీలోని కీలక వ్యక్తులను అరెస్టు చేస్తున్నారన్నారు. అలాగే పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన కోర్కెలపై పోరాడుతున్న రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కూడా అన్యాయంగా హౌస్ అరెస్టు చేశారన్నారు. దానివల్ల కార్మికులకు అన్యాయం చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు.

హోరున వర్షం.. రోడ్లు జలమయం


బూరుగుపూడి జాతీయ రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

కోరుకొండ: అల్పపీడనం కారణంగా గురువారం ఉదయం నుంచి మండలంలో జోరు వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోరుకొండ–గోకవరం 516ఈ జాతీయ రహదారి, బూరుగుపూడి–గుమ్ములూరు రోడ్డు, కోరుకొండ–కోటికేశవరం, రాఘవపురం–బొల్లెద్దుపాలెం రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఇలాఉండగా ఈ ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యం కావడంతో సాగు పనుల్లో జాప్యం ఏర్పడింది. ఎండిపోతున్న ఆకుమడులకు ఈ వర్షంతో మేలు చేకూరినట్టు రైతులు చెబుతున్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం


పైన గ్రామంలో సచివాలయం ఉద్యోగులను అభినందిస్తున్న సర్పంచ్ ప్రమీల తదితరులు

పెదపూడి: సచివాలయం ఉద్యోగుల సేవలు అభినందనీయమని పైన గ్రామ సర్పంచ్ సుందరపల్లి ప్రమీల అన్నారు. ఆ గ్రామ పంచాయతీలో ఇంత వరకూ వివిధ శాఖల్లో పనిచేసి ఇతర సచివాలయాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం ప్రజలకు అందుబాటులో పనిచేసేవారు ప్రజల ఆదరణ, అభిమానం పొందుతారన్నారు. అనంతరం ఉద్యోగులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుందరపల్లి వీరభద్రం, మాజీ సర్పంచ్ కట్టా వెంకట రమణ, సాదే చిట్టిబాబు, మాకన అర్జున, కొప్పుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పందలపాక ఉన్నత పాఠశాల పరిశీలన


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారి వాసుదేవరావు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో బోధనా అంశాలపై చర్చించారు. పదో తరగతి చాల కీలకమని, ముందు నుంచి చదివితే, పరీక్ష సమయంలో చాలా సులువుగా అనిపిస్తుందన్నారు. విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాల గతంలో కంటే ఇంకా మెరుగుపడాలని, అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తినేలా చూడాలన్నారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, పీడీ ద్వారంపూడి యువరాజా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంత్యుత్సవం

రంగంపేట: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంత్యుత్సవాన్ని గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత గ్రంథాలయోద్యమానికి విశేష కృషి చేసిన అయ్యంకి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎం.రామభద్రరావు, ఎస్వీ రమణ, పాఠకులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల సందర్శన

బిక్కవోలు: మండలంలోని ప్రాచీన లక్ష్మీగణపతి, గోలింగేశ్వరస్వామి ఆలయాలను టూరిజం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కర్రి ఉదయ భాస్కరరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాద్ పథకంలో దేవాలయాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. బిక్కవోలు జోడినాదాల తూము నుంచి లక్ష్మీ గణపతి దేవాలయం వరకూ బైపాస్ రోడ్డు వేయాలని ప్రతిపాదించారు. అక్కడి నుంచి గొల్లల మామిడాడ వెళ్లటానికి అదే రోడ్డును కొత్త కాలనీ అవతల కలపాలన్నారు. కార్యక్రమంలోని ఆలయ ఈవో రామలింగ, ఎంపీపీ తేతలి సుమ, మాజీ ఎంపీపీ బేరా వేణమ్మ, కూటమి నేతలు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం


బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహోపాధ్యాయులు, విద్యార్థులు

బిక్కవోలు: ఇలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఏడుగురు ఉపాధ్యాయులను గురువారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమన్నారు. అనంతరం చింతా వీరభద్రరావు, రొంగల సూర్యనారాయణ, పి.రత్నారావు, ఎం.సూర్యనారాయణ, కేపీవీవీఎస్ఎన్ కృష్ణ ప్రసాద్, పి.సుధామాధురిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలోని మల్లిడి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ల రామచంద్రారెడ్డి, విజయలక్ష్మి, తమలంపూడి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ప్లేస్మెంట్ డ్రైవ్‌కి 18 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరిలో పది మందిని ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థిర విధానాలతో వనరుల వినియోగం



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ జయానందకుమార్

రాజానగరం: భూమిపై అపరిమితంగా ఉన్న వనరులను వినియోగించుకోవడంలో స్థిరమైన విధానాలను పాటించాలని గైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ అన్నారు. కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో పరిమిత గ్రహం, పరిమిత వినియోగాన్ని పొందుదాం అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. పర్యావరణానికి ఎటువంటి హాని జరగకుండా వినియోగించడంతో పాటు, పునర్వినియోగం చేయడం వంటి పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

పెదపూడి: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ భాస్కరరెడ్డితో కలిసి గురువారం జి.మామిడాడలోని సూర్యదేవాలయాన్ని గురువారం సందర్శించారు. గ్రామ పెద్దలు, ఆలయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ద్వారా బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి, లక్ష్మీగణపతి, జి.మామిడాడలో సూర్యదేవాలయం, కోదండ రామాలయాలను ఒక టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేసి, మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. వాటికి సంబంధించి డీపీఆర్‌ను విజయభాస్కర్‌రెడ్డి తయారు చేయనున్నారన్నారు. ఈ నేపథ్యంలో విజయభాస్కర్‌రెడ్డికి గ్రామ పెద్దలు, భక్తులు వారి సలహాలు అందజేయవచ్చన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

రాజానగరం: మండలంలోని పాత తుంగపాడుకు చెందిన బోయిడి సత్యనారాయణ (49) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై వీర్రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణకు ఆర్థిక ఇబ్బందులు కూడా తోడవడంతో విసిగిపోయాడు. ఇదే సమయంలో కొడుకు రోడ్డు ప్రమాదానికి గురై కాలు, చేయి విరిగి మంచాన పడటం అతడిని మరింత కుంగదీసింది. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం పొలంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.